సాక్షి కామారెడ్డి

శుక్రవారం । 2 । మే । 2025



సమ్మర్ క్యాంపు..

లింగంపేట మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం నుంచి సమ్మర్ క్యాంపు ప్రారంభమైంది.

- 8లో ▸



పడకేసిన పారిశుధ్యం

బిచ్కుంద, నస్రుల్లాబాద్ మండలాల్లో పంచాయతీల పాలన అస్తవ్యస్తంగా మారింది. పారిశుధ్య నిర్వహణ కరువైంది.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
43.9 /23.6

ఉదయం ఈదురుగాలులు వీస్తాయి. క్రమంగా ఎండ తీవ్రత పెరుగుతుంది. వాతావరణం పొడిగా మారుతుంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఎస్సెస్సీ టాపర్లకు సన్మానం



కామారెడ్డి టౌన్ : ఎస్సెస్సీలో స్టేట్ టాపర్లుగా నిలిచిన విద్యార్థులను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ గురువారం తన చాంబర్‌లో సన్మానించారు. 596 మార్కులు సాధించిన నిమ్మ అన్షితతో పాటు 590 మార్కులు సాధించిన కొండ గాయత్రి, శ్రేణితను ఘనంగా సన్మానించారు. ఎస్పీఆర్ స్కూల్ కరస్పాండెంట్ మారుతి, టీచర్లు పాల్గొన్నారు.

భూ భారతితో సమస్యలకు పరిష్కారం



నిజాంసాగర్(జుక్కల్) : భూ భారతితో భూముల సమస్యలు పరిష్కారమవుతాయని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. జుక్కల్‌లోని క్యాంపు కార్యాలయానికి గురువారం వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులు తాము ఎదుర్కొంటున్న భూ సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పట్టాపాస్ పుస్తకాలతోపాటు సాదాబైనామా తదితర సమస్యలకు భూభారతితో పరిష్కారం లభిస్తుందన్నారు. ధరణి కారణంగా పాస్‌పుస్తకాలు లేక ఎంతో మంది రైతులు రైతుబంధు, రైతుబీమాకు దూరమయ్యారని రైతులు అన్నారు. భూముల సమస్యలను తెలుసుకునేందుకు గ్రామాల వారీగా అధికారులు రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసి, పరిష్కారం చూపిస్తారన్నారు.

సమ్మె విరమణ



భిక్కనూరు : యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టమైన హామీ ఇచ్చారని కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణగుప్తా అన్నారు. సౌత్ క్యాంపస్‌లోని దీక్షాశిబిరం వద్ద గురువారం ఆయన మాట్లాడారు. కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం తరఫున సీఎంను కలిసి సమస్యలను వివరించగా పరిష్కారానికి ఆయన సానుకూలంగా స్పందించారని, దీంతో సమ్మె విరమిస్తున్నామన్నారు. ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్ కాంట్రాక్ట్ అధ్యాపకులకు నిమ్మరసం అందజేసి సమ్మెను విరమింపజేశారు. అధ్యాపకురాలు ప్రతిజ్ఞ, కాంట్రాక్ట్ అధ్యాపకులు సరిత, యాలాద్రి, సునీత, నర్సయ్య, రమాదేవి, వైశాలి, శ్రీకాంత్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



కామారెడ్డి టౌన్: కేంద్ర కేబినెట్ జనగణనతో పాటు కులగణన నిర్ణయం తీసుకోవడాన్ని హర్షిస్తూ బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చిత్రపటానికి నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ చేపట్టిన కులగణన తప్పుల తడకగా ఉందని, ప్రస్తుతం కేంద్రం చేపట్టబోయే జనగణన, కులగణనతో పూర్తి స్పష్టత వస్తుందన్నారు. దేశాభివృద్ధి కేవలం బీజేపీతోనే సాధ్యమని అన్నారు. ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు తోట బాలరాజు, పట్టణ అధ్యక్షుడు ఉప్పు లక్ష్మీపతి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రంజిత్ మోహన్, నాయకులు పోతరాజు వెంకటేశ్, గోపుస్వామి, శ్రీకాంత్, గోవర్దన్ పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ గడువు పొడిగింపు

కామారెడ్డి టౌన్: లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం(ఎల్‌ఆర్‌ఎస్) గడువును ఈనెల 3వ తేదీ వరకు పొడిగిస్తూ ప్రభుత్వం గురువారం జీవో విడుదల చేసింది. 25శాతం ఫీజు రాయితీతో గడువును పెంచింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసు కోవాలని మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి కోరారు.

పాడి పరిశ్రమకు రుణాలు

మాంసం ఉత్పత్తి పెంచే దిశగా చర్యలు

- రూ. 50లక్షల వరకు రుణాలపై రాయితీ
- ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తులకు ఆహ్వానం
- అవగాహన లేకపోవడంతో అందని పథకం



బీబీపేట : రోజురోజుకీ పెరుగుతున్న మాంసం వినియోగాన్ని దృష్టిలో ఉంచుకుని పశువుల పెంపకానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. మాంసం ఉత్పత్తిని పెంచే దిశగా అడుగులు వేస్తోంది. పశువులతోపాటు మేత, దాణా లభ్యతను పెంచేందుకు సైతం జాతీయ పశు సంపద మిషన్ (ఎన్ఎల్ఎం) ద్వారా రుణ అవకాశం కల్పిస్తోంది.

నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ స్కీం ద్వారా రుణాలు

పశువుల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ స్కీం(ఎన్ఎల్ఎం) ద్వారా రుణాలను మంజూరు చేస్తోంది. ఇందులో భాగంగా గొర్రెలు, మేకలు, పొట్టేళ్లు, పందులు, నాటుకోళ్లు, పుంజులతోపాటు పశుగ్రాసం, దాణా పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహం కల్పించనుంది. 2021–22 ఆర్థిక సంవత్సరంలో ప్రారంభమైన ఈ పథకాన్ని పశు సంవర్ధక శాఖ అమలు చేసేందుకు చర్యలు చేపట్టింది. పశువుల పెంపకానికి ఆసక్తి ఉన్న వారికి సబ్సిడీ రుణాలు మంజూరు చేసేందుకు కృషి చేస్తోంది.

రూ.10లక్షల నుంచి 50 లక్షల వరకు సబ్సిడీ

ఎన్ఎల్ఎం పథకం ద్వారా రూ.10లక్షల నుంచి రూ.50 లక్షల వరకు సబ్సిడీని మంజూరు చేస్తుంది. లబ్ధిదారుడికి విడతల వారీగా సబ్సిడీ అందించనున్నారు. యూనిట్ నెలకొల్పిన తర్వాత సబ్సిడీ వచ్చే వరకు రాష్ట్ర పశుసంవర్ధక శాఖ పర్యవేక్షిస్తుంది.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

ఎన్ఎల్ఎం పథకానికి ఆసక్తిగల వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఆ తరువాత విచారణ చేపట్టి రుణం మంజూరు చేస్తారు. అలాగే పశువుల పెంపకానికి కేంద్ర ప్రభుత్వం ఈ నిధులు విడుదల చేస్తుంది. దీని ద్వారా రైతులు లబ్ధి పొందడంతోపాటు వారి జీవనాభివృద్ధికి ఉపయోగపడుతుంది.

– సంజయ్, జిల్లా పశువైద్యాధికారి, కామారెడ్డి

ఆసక్తి ఉన్న వారు..

యూనిట్ స్థాపించేందుకు ఆసక్తి ఉన్నవారు సంబంధిత వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఎటువంటి ఫీజు ఉండదు. దరఖాస్తుదారుడు ఫొటో, అడ్రస్, ఆధార్ కార్డు, బ్యాంక్ స్టేట్‌మెంట్ తదితర పత్రాలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

ఇప్పటి వరకు లబ్ధిదారులు ముగ్గురే..

కేంద్ర ప్రభుత్వం పశువుల పెంపకానికి ప్రోత్సాహకంగా ఎన్ఎల్ఎం పథకం ద్వారా రుణాలు మంజూరు చేసి సబ్సిడీ అందిస్తోంది. పథకాన్ని ప్రారంభించి రెండుమూడేళ్లు గడుస్తున్నప్పటికీ సరైన అవగాహన లేక పోవడంతో పథకానికి దూరంగా ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా పథకం లబ్ధిదారులు కేవలం ముగ్గురు మాత్రమే ఉన్నారు. అలాగే మరో ఏడుగురి దరఖాస్తులు పరిశీలనలో ఉన్నట్లు అధికారులు తెలిపారు.

ఎన్ఎల్ఎం అందించే పథకం, రాయితీ వివరాలు..(రూ.లలో)

మేకలు				
గొర్రెలు + పొట్టేలు	యూనిట్ విలువ	సబ్సిడీ	రైతువాటా	బ్యాంకురుణం
500+25	కోటి	50లక్షలు	10లక్షలు	40లక్షలు
400+20	80లక్షలు	40లక్షలు	8లక్షలు	32లక్షలు
300+15	60 లక్షలు	30లక్షలు	6లక్షలు	24లక్షలు
200+15	40లక్షలు	20లక్షలు	4లక్షలు	16లక్షలు
100+5	20లక్షలు	10లక్షలు	2లక్షలు	8లక్షలు
పందులు				
మగ+ఆడ	యూనిట్ విలువ	సబ్సిడీ	రైతువాటా	బ్యాంకురుణం
100+10	30లక్షలు	15 లక్షలు	3 లక్షలు	12లక్షలు
50+5	15లక్షలు	7.5లక్షలు	1.5లక్షలు	6లక్షలు
కోడి, పుంజు	యూనిట్ విలువ	సబ్సిడీ	రైతువాటా	బ్యాంకురుణం
1000+100	50లక్షలు	25 లక్షలు	5లక్షలు	20లక్షలు
దాణా/గడ్డి	కోటి	50 లక్షలు	10లక్షలు	40లక్షలు

ఏ నేల.. ఏ పంటకు అనుకూలం?

జిల్లాలో నాలుగేళ్లుగా భూసార పరీక్షలకు బ్రేక్

- ఇష్టారీతిన ఎరువులు వినియోగిస్తున్న రైతులు
- తగ్గుతున్న భూసారం.. పంట దిగుబడి



రాజంపేట పరిధిలో భూసార పరీక్షకు శాంపిళ్లను సేకరిస్తున్న వ్యవసాయాధికారులు (ఫైల్)

రాజంపేట: భూసారాన్ని తెలుసుకోవడంతోపాటు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి పంట దిగుబడులను పెంచేందుకు చేపట్టాల్సిన భూసార పరీక్షలు నాలుగేళ్లుగా జిల్లాలో చేపట్టడం లేదు. రైతులు స్వల్ప పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించాలని ప్రభుత్వాలు పదే పదే చెబుతుండడంతోపాటు నేల స్వభావాన్ని బట్టి పంటలు సాగు చేయాలని సూచిస్తున్నాయి. ఇందులో ఎంతోకీలకమైన భూసార పరీక్షలు మాత్రం చేపట్టడం లేదు. మండలాల వ్యవసాయాధికారులకు కిట్లను అందజేసినా నాలుగేళ్లుగా భూసార పరీక్షల జాడలేకపోవడం గమనార్హం.

జిల్లా వ్యాప్తంగా వానాకాలం సీజన్‌లో లక్షల ఎకరాల విస్తీర్ణంలో వివిధ రకాల పంటలు సాగవుతాయి. కేవలం రాజంపేట మండలంలోనే 9 వేల ఎకరాల పైచిలుకు విస్తీర్ణంలో పంటలు సాగవుతాయి. గతంలో వేసవిలో భూసార పరీక్షలు ఏఈవోల ద్వారా చేసేవారు. ఆ ఫలితాలకు అనుగుణంగా రైతులు పంటల సాగుకు ప్రాధాన్యం ఇచ్చేవారు. అయితే నాలుగేళ్లుగా ఆ ఊసే లేకపోవడంతో రైతులు ఇష్టారీతిన ఎరువులను వినియోగిస్తున్నారు. దీంతో పంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతోంది. గతంలో ఏటా నీటి లభ్యత ఉన్న ప్రాంతాల్లో పదెకరాలకు ఒక మట్టి నమూనా, వర్షాధారిత ప్రాంతాల్లో 25 ఎకరాలకు ఒక మట్టి నమూనా సేకరించి పరీక్షలు చేసి నేల పరిస్థితులపై రైతు లకు అవగాహన కల్పించేవారు. తదనుగుణంగా రైతులు ఎరువులను వాడేవారు. నాలుగేళ్లుగా భూసార పరీక్షల కార్యాచరణను రూపొందించడం లేదు.

మూలకు చేరిన పరికరాలు

ప్రభుత్వం 2018లో భూసార పరీక్షలను ప్రారంభించగా 2020 వరకు సజావుగా సాగాయి. ఇందుకోసం రూ.1.30 లక్షల విలువైన ఒక్కో కిట్టును ఏఈవోలకు అందించారు. అప్పట్లో రైతు వేదికలు లేకపోవడంతో గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఉంచారు. రైతు వేదికలను నిర్మించిన తరువాత వాటిని అందులోకి మార్చినప్పటికీ మూలకు చేరాయి. 2020 వరకు ఈ పరీక్షలు సజావుగా సాగాయి.

బడ్జెట్ లేక ఆలస్యం

గత నాలుగు సంవత్సరాలుగా భూసార పరీక్షలు నిర్వహించడం లేదు. బడ్జెట్ లేకపోవడమే ఇందుకు కారణం. ఈ విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. ప్రభుత్వం నిధులు విడుదల చేసిన వెంటనే భూసార పరీక్షలు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం

– శృతి, ఏవో రాజంపేట

మేడే.. వారికి వర్కింగ్ డే



ప్రపంచమంతా కార్మికులకు మేడే శుభాకాంక్ష లు తెలుపగా.. నస్రుల్లాబాద్ మండలం దుర్కి గ్రామ పంచాయతీ అధికారులు మాత్రం 'మేడే.. కాదు వర్కింగ్ డే' అంటూ పారిశుధ్య కార్మికులతో పని చేయించారు. పారిశుధ్య కార్మికులు ఎప్పటిలాగే గురువారం గ్రామంలోని డ్రెయినేజీలను శుభ్రం చేశారు. ఈ దృశ్యం 'సాక్షి' కెమెరాకు చిక్కింది.

– నస్రుల్లాబాద్(బాన్సువాడ)

ప్రజలను అప్రమత్తం చేయాలి




పోలీస్ స్టేషన్ ఆవరణలో సిబ్బందితో ఎస్పీ రాజేశ్‌చంద్ర

నస్రుల్లాబాద్ (బాన్సువాడ): ఆన్‌లైన్ బెట్టింగ్, సైబర్‌క్రైమ్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేసేందుకు వారికి అవగాహన కల్పించాలని ఎస్పీ ఎం రాజేశ్ చంద్ర సూచించారు. నస్రుల్లాబాద్ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులు, రిసెప్షన్, టెక్ టీమ్, లాక్ అప్ రూమ్, పార్కింగ్ పరిసరాలను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిసరాల్లో ఆహ్లాదకర వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో వినియోగించే డయల్ 100 కాల్స్‌కు వెంటనే స్పందించాలని ఆదేశించారు. స్టేషన్‌కు వచ్చే బాధితులకు తక్షణమే న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకు రావాలని సిబ్బందికి సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు విస్తృతంగా చేపడుతూ రోడ్డు ప్రమాదాలను తగ్గించాలని, గ్రామాల్లో మూఢనమ్మకాలు, బాల్యవివాహాలపై అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట బిచ్కుంద సీఐ నరేశ్, ఎస్సై లావణ్య, ఉన్నారు.

నోటీసు ఉత్తుత్తిదేనా..?

- నిబంధనలు పాటించకుండా జారీ

భిక్కనూరు: మండల కేంద్రంలోని సిద్ధరామేశ్వర ఆలయంలో హుండీ లెక్కింపు సమయంలో ఎలక్ట్రిషియన్ డబ్బులు తీసిసినట్లు ఫిర్యాదు అందిన విషయం తెలిసిందే. అయితే ఎలక్ట్రిషియన్‌కు ఈవో శ్రీధర్ నోటీసు జారీ చేసిన తీరు ప్రస్తుతం చర్చనీయాంశమైంది. గత నెల 22వ తేదీన హుండీ లెక్కిస్తున్న సమయంలో ఎలక్ట్రిషియన్ లక్ష్మీనారాయణ చేతివాటం ప్రదర్శించగా ఆలయ పునర్నిర్మాణకమిటీ చైర్మన్ అందె మహేందర్‌రెడ్డి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని ఈవోకు ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని 'సాక్షి' దినపత్రిక అదే నెల 29వ తేదీన వెలుగులోకి తీసుకురాగా భక్తులు ఆలయానికి చేరుకుని ఈవోను నిలదీశారు. అయితే తాను ఎలక్ట్రిషియన్‌కు 23వ తేదీనే నోటీసు ఇచ్చినట్లు ఈవో వారికి తెలిపారు. 29వ తేదీన 'సాక్షి'లో కథనం ప్రచురితం కావడంతో అదే రోజు ఉదయం హుటాహుటిన ఆలయానికి చేరుకున్న ఈవో పాత తేదీ(23)తో నోటీసు రూపొందించి ఎలక్ట్రిషియన్ నుంచి రిసీవ్డ్ సంతకం తీసుకున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. నోటీసు ఎవరికి ఇచ్చింది కనీసం అందులో లేదని, ఎలక్ట్రిషియన్ సంతకం ఎలా పెట్టారని పలువురు ప్రశ్నించగా, ఆయన సంతకం చేయడంతోనే పేరు అందులో రాయలేదని ఈవో సమాధానమిచ్చారు. ఆ తరువాత ఎలక్ట్రిషియన్ పేరును నోటీసు మధ్యలో ఇరికించి మీడియాకు పంపించారు. ఈవో శ్రీధర్ లెటర్ నంబర్, క్రమ సంఖ్య లేకుండా నోటీసు ఇవ్వడం అనుమానాలకు తావిస్తోంది. గతంలో చిన్న తప్పు చేసిన ఓ ఉద్యోగిని ఎలాంటి విచారణ లేకుండానే సస్పెండ్ చేసిన ఈవో.. హుండీ లెక్కింపులో చేతి వాటం ప్రదర్శించిన ఉద్యోగిని ఎందుకు వెనుకేసుకొస్తున్నారని, పోలీసులకు ఎందుకు ఫిర్యాదు చేయలేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.



ఎలక్ట్రిషియన్ లక్ష్మీనారాయణకు జారీ చేసిన నోటీసు

'గణన' నిర్ణయం బీసీ సంఘాల విజయం



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు శివరాములు

కామారెడ్డి అర్బన్: జనాభా లెక్కలతోపాటు సమగ్ర కులగణన చేపడతామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం బీసీ సంఘాల ఉద్యమాల విజయమని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సాప శివరాములు అన్నారు. పట్టణంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నరేంద్రమోదీ ప్రభుత్వానికి బీసీ సంఘాలు ధన్యవాదాలు తెలుపుతున్నాయన్నారు. బీసీల జనాభా ప్రకారం జాతీయ, రాష్ట్రస్థాయిలో ఉద్యోగాలు, రాజకీయ పదవులు, చట్టసభల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని, అంతవరకు ఉద్యమాలు కొనసాగుతాయన్నారు. సమావేశంలో నాయకులు నీల నాగరాజు, ఐరేని సందీప్, నాగరాజుగౌడ్, మోహనచారి, సాయాగౌడ్, రవికుమార్, వడ్ల సురేశ్, దయాకర్, జే నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



మన పిల్లలను మన బడిలోనే చదివిద్దామంటూ పాల్వంచ మండలంలోని ఫరీద్‌పేట ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థులు గురువారం గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. తమకు బతుకు బాట నేర్పిన సర్కారు బడి అభ్యున్నతికి కృషి చేస్తామని అన్నారు. స్థానిక పాఠశాలలో విద్యాబుద్ధులు నేర్చుకుని ఉద్యోగ, వ్యాపార రంగాల్లో స్థిరపడిన వారు గ్రామానికి చేరుకుని బడిబాటలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి, అసిస్టెంట్ ప్రొఫెసర్ శంకర్ మాట్లాడుతూ.. మౌలిక వసతులతో పాటు ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టి ప్రాథమిక స్థాయి నుంచే నాణ్యమైన విద్యను అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలన్నారు. ఆరోతరగతి నుంచి ఐఐటీ నీట్ విద్యాబోధన జరిగేలా చూడాలని కోరారు. ఎంఈవో రాంమనోహర్‌రావు, పూర్వ విద్యార్థులు పల్లె రమేశ్‌గౌడ్, సిద్ధరాంరెడ్డి, వెంకటరాజగౌడ్, కొంగల వెంకటి, బట్టరాజు, లక్ష్మీరాజం దీపక్‌గౌడ్, వెంకట్‌రాములు, చిన్నయ్య, గోపాల్‌రెడ్డి, సాయిరెడ్డి, శ్రీకాంత్, బాల్‌రాజ్‌గౌడ్, ఎల్లాగౌడ్, సురేశ్, నాగరాజు, సత్యంరెడ్డి, వీరచారి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

- మాచారెడ్డి

శవాలను పూడ్చేచోట 'ఉపాధి' పనులు

- గుంత తవ్వుతుండగా బయటపడిన మృతదేహం
- రామారెడ్డి మండలం కన్నపురంలో ఘటన

రామారెడ్డి : శవాలను పూడ్చిపెట్టే చోట ఉపాధి హామీ పనులు చేయించడంతో గుంత తవ్వుతుండగా ఓ మృతదేహం కనిపించింది. కూలీలు వెంటనే మట్టి కప్పివేశారు. ఈ ఘటన గురువారం మండలంలోని కన్నపురం శివారులో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గొల్లపల్లి గ్రామానికి చెందిన కొంతమంది కూలీలు కన్నపురం గ్రామ శివారులోని రంగ చెరువు ప్రాంతంలో ఉపాధి పనులు చేశారు. గుంతలు తవ్వుతుండగా ఓ కూలీకి పాతిపెట్టిన శవం కనిపించింది. దీంతో కూలీలు వెంటనే గుంతను పూడ్చివేశారు. రంగా చెరువులో ప్రాంతంలో రామారెడ్డి గ్రామస్తులు, కన్నాపూర్ గ్రామస్తులు అంత్యక్రియలు నిర్వహిస్తుంటారు. కనీసం ఫీల్డ్ అసిస్టెంట్‌కు అంత్యక్రియలు నిర్వహించే చోటు కూడా తెలియదా అని కూలీలు ప్రశ్నిస్తున్నారు. గొల్లపల్లి రామారెడ్డి గ్రామానికి ఫీల్డ్ అసిస్టెంట్‌గా రామారెడ్డి గ్రామానికి చెందిన రజిత పని చేస్తున్నారు. గొల్లపల్లిలో మేట్‌గా పనిచేసే వ్యక్తి పనులు కల్పించేందుకు రూ.వెయ్యి నుంచి రూ.3వేలు వసూలు చేస్తున్నారని గ్రామస్తుల ఆరోపిస్తున్నారు. తాము పనిచేస్తే అన్ని డబ్బులు రావని.. మేట్‌కు ఏం ఇస్తామని కూలీలు పనికి దూరంగా ఉంటున్నారని అంటున్నారు.

ఆర్టీసీ సమ్మె వాల్ పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

కామారెడ్డి టౌన్: ఆర్టీసీ ఉద్యోగుల డిమాండ్‌ల పరిష్కారం కోసం ఈనెల 7 నుంచి తలపెట్టిన ఆర్టీసీ సమ్మెను విజయవంతం చేయాలని ఆర్టీసీ జేఏసీ రాష్ట్ర అడిషనల్ సెక్రటరీ వెంకట్‌గౌడ్, వీడీ దాస్‌లు పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని కామారెడ్డి ఆర్టీసీ బస్టాండ్ ముందు సమ్మె పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆ ర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయా లని, ట్రేడ్ యూనియన్‌లపై ఆంక్షలు ఎత్తివేయాలని,గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని, 2017 వేతన సవరణ బకాయిలను చె ల్లించాలని తదితర డిమాండ్‌లను రాష్ట్ర ప్రభు త్వం పరిష్కరించాలని కోరారు. ఆర్టీసీ జేఏసీ నాయకులు బాలాగౌడ్, శేకర్, ప్రేమ్‌కుమార్, గిరి, బుచ్చిరెడ్డి, అంజయ్య, శ్యామ్ కార్మికులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీఎస్‌ను కలిసిన గడుగు



నిజామాబాద్ సిటీ: ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)గా బాధ్యతలు చేపట్టిన రామకృష్ణారావును రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలోని చాంబర్‌లో రామకృష్ణారావును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గడుగు వెంట భవానీరెడ్డి, మెంబర్ సెక్రటరీ గోవింద్ ఉన్నారు.

ఘనంగా అ'పూర్వ' సమ్మేళనం



మోపాల్: మండలంలోని ముదక్‌పల్లి జెడ్పీ పాఠశాలలో 1999–2000 సంవత్సరంలో పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. 25 ఏళ్ల తర్వాత అందరూ ఒకే చోట చేరడంతో సంతోషం వ్యక్తం చేశారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంగ్యానాయక్, దయానంద్, లసీరాం, గోపాల్, శ్రీలత, సునీత, పద్మ, పూర్వ విద్యార్థులు, గురువులు పాల్గొన్నారు.

ఘనంగా 'మే' డే



జిల్లా కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



జిల్లా కేంద్రంలో సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో..



బిచ్కుందలో జెండా ఎగురవేస్తున్న కార్మికులు

జిల్లా వ్యాప్తంగా మే డే వేడుకలను కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. సీపీఎం, సీఐటీయూ, సీపీఐ, ఏఐటీయూసీ, బీఎల్‌టీయూ, మున్సిపల్ కార్మికుల, ఆర్టీపీ, బీడీ కార్మికుల సంఘాల ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు.

– సాక్షి, నెట్‌వర్క్



ఎల్లారెడ్డిలో జెండాను ఎగరవేస్తున్న ఎలక్ట్రిసిటీ సంఘం నాయకులు



పిట్లంలో జెండా ఎగురవేస్తున్న బీడీ కార్మికులు



రామారెడ్డిలో..



బోర్లంలో ..



సదాశివనగర్ :తిర్మన్‌పల్లిలో..



సీపీఐ, ఏఐటీయూసీ బాన్సువాడ శాఖ ఆధ్వర్యంలో..



భిక్కనూరు జీపీలో పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న కాంగ్రెస్ నేతలు

సమ్మర్ క్యాంపును వినియోగించుకోవాలి



రాజంపేటలో అథ్లెటిక్స్ వేసవి శిబిరం ప్రారంభోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు



లింగంపేట బాలుర ఉన్నత పాఠశాలలో వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు



పేట్‌సంగెంలో వాలీబాల్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న పీఈటీ లక్ష్మణ్

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం నుంచి సమ్మర్ క్యాంపు ప్రారంభమైందని, దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి షౌకత్‌అలీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమ్మర్ క్యాంపు మే మొదటి తేదీ నుంచి 15వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. ప్రతీ రోజు ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు క్యాంపు నిర్వహిస్తామన్నారు. ఈ క్యాంపులో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులు పాల్గొనాలని సూచించారు. 15 రోజుల పాటు వహీద్‌సిద్ధీఖీ, సంతోస్‌కుమార్ విద్యార్థులకు వాలీబాల్ క్రీడలో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

గాంధారి(ఎల్లారెడ్డి): తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాథారిక సంస్థ ఆధ్వర్యంలో కొనసాగే క్రీడల వేసవి శిక్షణలో భాగంగా పేట్‌సంగెం జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గురువారం వాలీబాల్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించినట్లు పీఈటీ లక్ష్మణ్ తెలిపారు. ప్రతి ఏటా మాదిరిగానే ఈ సారి కూడా విద్యార్థులు శిక్షణకు హాజరవుతున్నారని తెలిపారు.

రాజంపేట: జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో అథ్లెటిక్స్ వేసవి శిబిరాన్ని కోచ్ శివగౌడ్ ఆధ్వర్యంలో ప్రారంభించినట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం జైపాల్ రెడ్డి తెలిపారు. ఈ వేసవి శిబిరం గురువారం నుంచి మే 31 వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ శిబిరం బాలుర ఉన్నత పాఠశాలలో కొనసాగుతుందని క్రీడాకారులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ర్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ కేపీ అనిల్ కుమార్, ఎంఈవో కే పూర్ణచందర్‌రావ్, పాఠశాల హెచ్‌ఎం ఈశ్వరయ్య, ఫిజికల్ డైరెక్టర్ ఎం స్వామి గౌడ్‌లు పాల్గొన్నారు.

వేసవి వాలీబాల్ శిక్షణ శిబిరం

బాన్సువాడ రూరల్: స్పోర్ట్స్ ఆథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాలలో మే ఒకటి నుంచి 31 వరకు వాలీబాల్ శిక్షణ శిబిరం ఉంటుందని శిక్షకుడు కే సురేందర్ తెలిపారు. పాఠశాలల్లో చదువుకునే 14 ఏళ్లలోపు విద్యార్థులు ఈశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉదయం 6గంటల నుంచి 8వరకు, సాయంత్రం 4గంటల నుంచి 6:30 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. వివరాలకు 99083 70837 నంబర్‌కు సంప్రదించాలన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో కొరవడిన నాణ్యమైన విద్య

- ఇందుకు నిదర్శనమే 'పది' ఫలితాలు
- నార్త్, సౌత్ మండలాల్లో 154 మంది విద్యార్థులు ఫెయిల్



ఖలీల్‌వాడి ఉన్నత పాఠశాల

నిజామాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధన కొరవడింది. దీనికి నిదర్శనమే బుధవారం వెలువడిన పదో తరగతి ఫలితాలు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందాలన్నా, మంచి ఫలితాలు రావాలన్నా బోధన ఎంత ముఖ్యమో.. పర్యవేక్షణ కూడా అంతే ముఖ్యం. విద్యావ్యవస్థలో సరైన పర్యవేక్షణ లేకపోవడంతోనే 'పది' ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలు వెనుకబడ్డాయని చెప్పొచ్చు. జిల్లా కేంద్రంలో పరీక్షల నిర్వహణ పకడ్బందీగా జరిగిందని జిల్లా అధికారులు పేర్కొంటున్నా మెరుగైన ఫలితాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దృష్టిసారించకపోవడమే అతి తక్కువ ఉత్తీర్ణత నమోదైందని విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు.

నార్త్, సౌత్ మండలాల్లో తక్కువ..

నార్త్ మండలంలో 248 మంది పరీక్ష రాయగా 215 మంది విద్యార్థులు పాసయ్యారు. ఇందులో అర్సపల్లి ప్రభుత్వ పాఠశాలలో 32 మందికి 25 మంది, కుమార్‌గల్లి పాఠశాలలో 19 మందికి 15 మంది, ఖలీల్‌వాడి పాఠశాలలో 79 మందికి 65 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు అయ్యారు. సౌత్ మండలంలో 361 మంది పరీక్ష రాయగా 240 మంది విద్యార్థులు పాసయ్యారు. కోటగల్లి శంకర్ భవన్ పాఠశాలలో 107 మందికి 61 మంది విద్యార్థులే పాసయ్యారు. వాటర్ ట్యాంక్ ఉన్నత పాఠశాలలో 21 మందికి 13 మంది, కసాబ్‌గల్లి పాఠశాలలో 135 మందికి 93 మంది, ఖిల్లా ప్రభుత్వ పాఠశాలలో 62 మందికి 45 మంది విద్యార్థులు పాసయ్యారు. జిల్లా వ్యాప్తంగా 766 మంది విద్యార్థులు ఫెయిల్ అయితే అందులో నార్త్, సౌత్ మండలంలో 154 మంది విద్యార్థులు ఉన్నారు. నార్త్, సౌత్ మండలాల్లో విద్యావ్యవస్థ గాడితప్పింది. ఇక్కడ జిల్లా కేంద్రం కావడంతో ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఇక్కడే ఉన్నారు. వారు సంఘాల పేరిట ప్రతి రోజు నిరసన కార్యక్రమాలు, సభ్యత్వాల నమోదు వంటి కార్యక్రమాలు చేపడుతూ పాఠశాలలకు డుమ్మాలు కొడుతున్నారు. గైర్హాజరును అరికట్టేందుకు ఉన్నతాధికారులు కూడా దృష్టిసారించకపోవడం విద్యావ్యవస్థను అస్తవ్యస్తం చేసింది. తరచూ విద్యార్థి సంఘాల తరగతుల బహిష్కరణ కూడా దీనికి కొందరు ఉపాధ్యాయ సంఘం నాయకులు వత్తాసు పలుకుతుండడంతో పాఠశాలల్లో నాణ్యమైన బోధన కొరవడుతోంది. సరైన విద్యాబోధన చేపట్టకపోవడంతోనే విద్యార్థులు చాలా మంది ఉత్తీర్ణులు కాలేదని పలువురు పేర్కొంటున్నారు.

పరిశీలన చేస్తాం

నార్త్, సౌత్ మండలాల్లో ఫలితాలు తక్కువ రావడంపై పరిశీలన చేస్తాం. మెరుగైన ఫలితాలు వచ్చేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తాం. ఈ మండలాల్లో మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తాం. మెరుగైన ఫలితాల కోసం ప్రణాళిక రూపొందిస్తాం.

– అశోక్, డీఈవో

కాంగ్రెస్ ఒత్తిడి మేరకే కులగణన



బాన్సువాడ: కాంగ్రెస్ పార్టీ ఒత్తిడి మేరకు కేంద్రం ప్రభుత్వం జనగణనతో పాటు కులగణన చేపట్టడానికి నిర్ణయించిందని తెలంగాణ స్టేట్ ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు అన్నారు. గురువారం ఆయన హైదరాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందించి మాట్లాడారు. తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కులగణన చేపట్టంతో కేంద్రం ఆ దిశగా చర్యలు తీసుకుందన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం గుర్తింపు



మోపాల్: మండలంలోని కాల్‌పోల్, పూర్వ వర్ని మండలంలోని తిమ్మాపూర్ అటవీ శివారులో గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని స్థానికులు గురువారం రాత్రి గుర్తించారు. గుర్తు తెలియని మహిళ తునికాకు సేకరణకు వచ్చి దారితప్పిపోయి ఉండవచ్చని గ్రామస్తులు భావిస్తున్నారు. మూడు, నాలుగు రోజుల కిందటే మహిళ మృతిచెంది ఉంటుందని స్థానికులు పేర్కొన్నారు. ఈ విషయమై స్థానికులు పోలీసులు, అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. కేసు విషయమై మోపాల్ ఎస్సై యాదగిరిని వివరణ కోరగా మహిళ మృతదేహంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని శుక్రవారం ఘటన స్థలాన్ని పరిశీలిస్తామని తెలిపారు. మృతదేహం మోపాల్ శివారు, పాత వర్ని శివారు ప్రాంతమ అనేది తెలియాల్సి ఉంది.

ఇసుక వేలంతో రూ.51వేల ఆదాయం



మోర్తాడ్: భీమ్‌గల్ మండలం బెజ్జోరా వాగు నుంచి ఇసుకను తవ్వి అక్రమంగా నిలువ చేయగా వాటిని ఇటీవల రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. గురువారం వాటికి వేలం నిర్వహించగా రూ.51వేల ఆదాయం లభించింది. బెజ్జోరా శివారులోని వాగు నుంచి తరలించి డంప్ చేసిన 25 ట్రాక్టర్ల ఇసుకకు తహసీల్దార్ మహమ్మద్ షబ్బీర్ వేలం నిర్వహించారు. ఏడుగురు వ్యాపారులు వేలంలో పాల్గొనగా బాబాపూర్‌కు చెందిన సమీర్ ఇసుక టెండర్‌ను దక్కించుకున్నాడు.

కేసులో వృద్ధురాలిని విచారించిన జడ్జి

ఖలీల్‌వాడి: అదనపు కట్నం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ వృద్ధురాలిని నిజామాబాద్ రెండవ అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ శ్రీనివాస్‌రావు గురువారం కోర్టు ఆవరణలో విచారించారు. వివరాలిలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని శివాజీ నగర్‌కు చెందిన ఓ మహిళ పలువురిపై వేధింపులు, అదనపు కట్నం పేరిట కోర్టులో కేసు వేశారు. విచారణలో భాగంగా నడవలేని స్థితిలో ఉన్న వృద్ధురాలు అనసూయను జడ్జి ఆమె వద్దకు వచ్చి విచ్చారించి వివరాలు తెలుసుకున్నారు.

క్రైం కార్నర్

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత



ఇందల్వాయి: మండలంలోని లింగాపూర్ వాగు నుంచి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను గురువారం పట్టుకొని పీఎస్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. పాటితండాకు చెందిన ఇద్దరు వ్యక్తులు ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో వెంటనే వాగులో తనిఖీలు చేపట్టి వారిని పట్టుకున్నట్లు చెప్పారు. గ్రామాల్లో ఎవరైనా ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మోపాల్‌లో..



మోపాల్: మండలంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న బదావత్ మోహన్‌కు చెందిన ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై యాదగిరిగౌడ్ గురువారం తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నారని సమాచారం రావడంతో ట్రాక్టర్‌ను పట్టుకొని పీఎస్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం.. ఆయిల్ చోరీ



నవీపేట: మండలంలోని నిజాంపూర్ ఎత్తిపోతల పథకానికి చెందిన ట్రాన్స్‌ఫార్మర్‌ను దుండగులు బుధవారం రాత్రి ధ్వంసం చేసినట్లు ఎస్సై వినయ్ గురువారం తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులోని కాపర్ కాయిల్స్, ఆయిల్‌ను ఎత్తు కెళ్లారని పేర్కొన్నారు. రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి

మాక్లూర్: గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన మాక్లూర్ మండలం వెంకటాపూర్‌లో శివారులో చోటు చేసుకుంది. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆలూర్ మండలం ఢీకంపల్లి గ్రామానికి చెందిన తంబాకు గౌరి(44), తంబాకు సాయిలు భార్యాభర్తలు. వీరు బోధన్ మండలం అమ్దాపూర్‌లో గురువారం నిర్వహించిన బంధువుల అంత్యక్రియలకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి బైక్‌పై వస్తుండగా వెంకటాపూర్ శివారులో ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని వాహనం వీరిని ఢీకొన్నది. ఈ ఘటనలో గౌరి పై నుంచి వాహనం వెళ్లడంతో ఆమె ఘటన స్థలిలోనే మృతి చెందింది. సాయిలుకు హెల్మెట్ ఉండడంతో స్వల్పగాయాలతో బయటపడ్డాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. గతంలోనే ఈ రోడ్డు గుండా అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని 'సాక్షి' పలుమార్లు కథనాలు ప్రచురించింది. అధికారుల్లో మాత్రం స్పందన కరువవుతోంది. ఈ రోడ్డు గుండా అనేక మూలమలుపులు ఉన్నాయి. కనీసం సూచిక బోర్డులు సైతం లేకపోవడంతో పలువురు వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పేకాట స్థావరంపై దాడి

సిరికొండ: మండలంలోని చిన్నవాల్గోట్ శివారులో పేకాట స్థావరంపై దాడి చేసి ఏడుగురిని గురువారం పట్టుకున్నట్లు ఎస్సై ఎల్ రామ్ తెలిపారు. వారి నుంచి రూ. 5,250 నగదు, ఐదు బైకులు, నాలుగు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

వేర్వేరు కారణాలతో పలువురి ఆత్మహత్య



పూజిత (ఫైల్)

కామారెడ్డి క్రైం: వేధింపులకు మరో నిండు ప్రాణం బలైంది. తరచూ భర్త వేధించడంతో ఓ వివాహిత భవనం పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లా కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలానికి చెందిన పసుపులేటి సాయి అనే వ్యక్తికి అదే మండలానికి చెందిన పూజిత(20)తో తొమ్మిది నెలల క్రితం వివాహం జరిగింది. కొంత కాలంగా సాయి కామారెడ్డి సమీపం లోని ఎంఎస్ఎన్ ఫార్మా కంపనీలో ఉద్యోగం చేస్తూ తన భార్యతో కలిసి అశోక్ నగర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. కొద్ది రోజులుగా సాయి మరో మహిళతో నిత్యం ఫోన్‌లో మాట్లాడుతున్నాడనే విషయంలో భార్యా భర్తల మధ్య గొడవ జరుగుతోంది. దీంతో పాటు పెళ్లి సమయంలో ఒప్పుకున్న అర ఎకరం భూమి రిజిస్ట్రేషన్ చేయించాలని సాయి తన భార్యతో తరచూ గొడవపడుతూ వేధింపులకు గురిచేసేవాడు. బుధవారం రాత్రి కూడా వారిద్దరి మధ్య గొడవ జరిగినట్లు కుటుంబీకులు తెలిపారు. దీంతో భర్త వేధింపులు తాళలేక మనస్థాపానికి గురైన పూజిత గురువారం ఉదయం వారు నివాసం ఉంటున్న రెండు అంతస్తుల భవనం పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. భర్త వేధింపులతోనే తన కుమార్తె ఆత్మహత్య చేసుకుందని ఆమె తండ్రి కృష్ణారావు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

జీవితంపై విరక్తితో ఒకరు..

రుద్రూర్: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి జీవితంపై విరక్తితో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సునీల్ గురువారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. కోటగిరి పీఎస్ పరిధిలోని పొతంగల్ మండలం సోంపూర్ గ్రామానికి చెందిన సీతాపులే సంజీవ్(42) మద్యానికి బానిసయ్యాడు. దీంతో జీవితంపై విరక్తితో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కుమార్తె కాపురంలో కలహాలు రావడంతో..



గోపి (ఫైల్)

మోర్తాడ్: కుమార్తె కాపురంలో కలతలు రావడంతో పాటు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఓ వ్యక్తి కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన మోర్తాడ్‌లో చేసుకుంది. ఎస్సై విక్రమ్ గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. మోర్తాడ్‌కు చెందిన కట్టికోల్ల గోపి(51) వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతని కుమార్తె ప్రేమ వివాహం చేసుకోగా ఆమె కాపురంలో సమస్యలు తలెత్తాయి. దీంతో తండ్రి వద్ద ఉంటోంది. మరో వైపు కాలికి ఏర్పడిన గాయం మధుమేహం వ్యాధితో తగ్గకపోవడంతో జీవితంపై విరక్తితో గోపి బుధవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లి కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య మానస ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ఆర్మూర్‌లో మరొకరు..



జాఫర్ మృతదేహం

ఆర్మూర్‌టౌన్: పెర్కిట్‌కు చెందిన సయ్యద్ జాఫర్(42) అనే వ్యక్తి జీవితంపై విరక్తితో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ గురువారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. జాఫర్ కొన్ని రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. దీంతో జీవితంపై విరక్తితో బుధవారం రాత్రి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు వెంటనే జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

అనారోగ్యంతో మహిళ..

ఆర్మూర్‌టౌన్: ఆరోగ్య సమస్యలు భరించలేని ఓ మహిళ పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడిన ఘటన ఆర్మూర్ మండలం చేపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. చేపూర్‌కు చెందిన ముత్యాల సుష్మ(47) అనే మహిళ ఆరోగ్య సమస్యలతో బాధ పడుతోంది. ఇటీవల ఆస్పత్రిలో చూయించినా నయం కాకపోవడంతో మనస్తాపానికి గురై బుధవారం రాత్రి ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబీకులు హైదరాబాద్‌కు తరలించగా అర్ధరాత్రి చికిత్స పొందుతూ మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

మహిళ దారుణ హత్య



హత్యకు గురైన కవిత

కామారెడ్డి క్రైం: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని సరంపల్లి శివారులో ఓ వివాహిత దారుణ హత్యకు గురైంది. ఘటనకు సంబంధించి ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సన్నపల్లి గ్రామానికి చెందిన చిదుర కవిత(40) అనే మహిళ బుధవారం సాయంత్రం వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు.

దీంతో ఆమె భర్త గంగారెడ్డి, కుటుంబ సభ్యులు వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి వెతికారు. అక్కడ ఓ చెట్టుకు చీరతో ఉరేసుకొని వేలాడుతూ కనిపించింది. వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం బృందాలను రప్పించి ఆధారాలు సేకరించారు. కవిత ఒంటిపై పుస్తెలతాడు, బంగారు ఆభరణాలు, కాళ్ల కడియాలు లేకపోవడం, ఒంటిపై గాయాలు ఉండటంతో గుర్తు తెలియని వ్యక్తులు ఆమెను హత్య చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. దుండగులు ఆభరణాల కోసమే ఆమెను హత్య చేసి ఉరేసుకున్నట్లు చిత్రీకరించే ప్రయత్నం చేసినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి భర్త గంగారెడ్డి ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పిచ్చికుక్క దాడిలో బాలుడికి తీవ్రగాయాలు



కామారెడ్డి అర్బన్: పిచ్చికుక్కదాడిలో ఐదేళ్ల బాలుడు తీవ్రంగా గాయపడిన ఘటన కామారెడ్డి పట్టణ పరిధిలోని దేవునిపల్లిలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. దేవునిపల్లిలో ఉన్న ముత్యాలమ్మ ఆలయ సమీపంలో మాడుగుల స్వామి, రమ్య నివసిస్తున్నారు. వీరి కుమారుడు ప్రగ్నేశ్ ఇంటి ఎదుట ఆడుకుంటుండగా పిచ్చికుక్క దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. ఎడమ కన్ను, చెవితో పాటు తొడలను తీవ్రంగా గాయపర్చింది. వెంటనే స్థానికులు ప్రగ్నేశ్‌ను కుక్క నుంచి కాపాడారు. కుటుంబీకులు చికిత్స కోసం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కు తరలించారు.